
ప్రజాశక్తి

గురువారం 7 డిసెంబర్ 2023

5

పార్వతీపురం మన్యం



పలువురు ఎస్ఐలకు బదిలీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. పాలకొండ ఎస్సై బి.శివప్రసాద్‌ను ఎల్విన్‌పేటకు, అక్కడ పనిచేస్తున్న షణ్ముఖరావును కురుపాంకు, కురుపాంలో పనిచేస్తున్న సిహెచ్ ప్రసాదును బత్తిలికి బదిలీ చేయగా అక్కడ పనిచేస్తున్న వై.అమ్మన్నరావును గరుగుబిల్లికి, బలిజిపేటలో పనిచేస్తున్న ఎస్ ప్రశాంత్ కుమార్‌ను పాలకొండకు, జిల్లా ఎస్పీ కార్యాలయంలో క్రైమ్ బ్రాంచ్‌లో ఉన్న వి.పాపారావును బలిజిపేటకు, పాచిపెంట ఎస్సైగా పనిచేస్తున్న షేక్ ఫక్రుద్దీన్‌ను ఎస్పీ క్రైమ్ బ్రాంచ్‌కు, పార్వతీపురం-2 ఎస్ఐ పి.నారాయణ రావును పాచిపెంటకు, కొట్టియాలో పని చేస్తున్న కె.సీతారామును పార్వతీపురం-2కు, పార్వతీపురం -1 ఎస్సై లావణ్యను ఆమె పూర్వ స్థానం దిశకు, జిల్లా దిశ ఉమెన్ సెల్‌లో పనిచేస్తున్న బి.సంతోషి కుమార్ పార్వతీపురం-1 ఎస్సైలుగా బదిలీ చేశారు.

అన్నదాత గుండె చెరువు



మక్కువ : చెముడులో నీటి మునిగిన వరిచేను బయటకు తీస్తున్న రైతులు



పాచిపెంట : మాతుమూరు -గురువునాయుడు మధ్య గండి పడ్డ కాజ్‌వే



సాలూరు : దత్తివలసలో నీటిలో ఉన్న వరి దిబ్బలు

- రైతుకు కన్నీరు మిగిల్చిన మిచౌంగ్
- 335 ఎకరాల్లో పంటనష్టం!
- నీటమునిగిన వరి, మొక్క జొన్న, పత్తి
- నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఎం

మిచౌంగ్ తుపానుతో అన్నదాత గుండె చెరువైంది. చేతికొచ్చిన పంట నీటపాలయింది. మరో వారం రోజుల్లో వరి చేలు కోత కోసి నూర్చాల్సిన సమయంలో అకాల వర్షం రైతుల్ని నిండా ముంచేసింది. ఎకరానికి రూ.20వేలు చొప్పున పెట్టుబడి పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. వరుసగా మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వరి పొలాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. చేల మీదుగా వరద నీరు ప్రవహిస్తోంది. కోతలు కోసి దిబ్బలు వేసిన పొలాల్లో కూడా నీరు నిల్వ ఉండడంతో ధాన్యం రంగు మారే అవకాశం ఉంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్ల ముందే నీటిపాలవ్వడంతో రైతు కన్నీరుమున్నీర వుతున్నాడు. ఇదిలా ఉండగా పలుచోట్ల నీటి మునిగిన వరి పంటలను సిపిఎం నాయకులు పరిశీలించారు. తక్షణమే అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని నాయకులు కోరుతున్నారు. పాచిపెంట మండలంలో మాతుమూరు- గురువునాయుడుపేట మధ్య వట్టిగెడ్డపై ఉన్న కాజ్‌వేకు గండిపడి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా అధికారులు జిల్లాలోని 335 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేశారు. అలాగే ఒక పూరిల్లు, పాల్జీ దెబ్బతిన్నట్టు గుర్తించారు.



సీతానగరం : నీటమునిగిన వరి పంటలను చూపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వేణు

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఎం

సీతానగరం : భారీ వర్షాలకు మండలంలో అంటిపేట, రామవరం, రెడ్డివానివలస రెవెన్యూలో ముంపునకు గురైన వరి పంట, మినుము, పెసర పంటలను సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, రైతు, కౌలు రైతు సంఘాలు నాయకులు కోరారు. అధికారులు తక్షణమే నష్టపరిహారాన్ని అంచనా వేసి రైతులకు ఎకరాకు రూ.50వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన, రంగు, మారిన ధాన్యం కొనుగోలుకు చేయాలని కోరారు. పంట నష్ట పోయిన రైతులు రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి ప్రియాంక, రెడ్డి సత్యనారాయణ, పైల కాశీ విశ్వనాధ్, యశోద, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కూర్మరాజుపేట, బంగారమ్మపేట, జనవరివలస, దత్తివలస, బొర్రపణుకువలస, తుపాకీ వలస, పసుపువానివలస, మామిడిపల్లి, మరిపిల్లి, గంగన్నదొర వలస, బోరబంద, జీగిరాం గ్రామాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నది. చేల్ల మీదుగా నీరు ప్రవహిస్తోంది. వెంగళరాయ సాగర్ రిజర్వాయర్ పైనున్న గ్రామాలు బొర్రపణుకువలస, తుపాకీవలస, పసుపువానివలసలో మొక్కజొన్న, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. మొక్క దశలో ఉన్న మొక్కజొన్న పొలాల్లోకి నీరు ఎక్కువగా చేరడంతో పంట కుళ్లిపోయి పెరిగే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. రెండో విడత ఏరివేతకు సిద్ధంగా పత్తి పంటల కూడా దెబ్బ తింది. గడచిన రెండు రోజులు గా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వాటి కింద ఉన్న పొలాలన్నీ జలమయమయ్యాయి. మంగళ, బుధవారాల్లో నియోజకవర్గం పరిధిలోని మండలాలలో భారీ వర్షపాతం నమోదైంది. సాలూరులో 78 మిల్లీమీటర్లు, పాచిపెంటలో 69.మిల్లీమీటర్లు, మక్కువలో 74.4మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోనే అత్యధిక శాతం వర్షపాతం నమోదు కావడంతో పంట నష్టం కూడా ఎక్కువా కనిపిస్తోంది.

పంటలు పరిశీలించిన అధికారులు:

మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి అనురాధ పండా, ఎంపిడిఒ జి.పార్వతి పరిశీలించారు. బుధవారం వారు బోరబంద, బాగువలస గ్రామాల్లో వరి పొలాలు పరిశీలించారు. ఇంతవరకు 78ఎకరాలలో వరి పంట దెబ్బ తిన్నదని ఎఒ చెప్పారు.

తడిసిన ముద్దయిన వరి పంట

పాలకొండ: తుపాను కారణంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురువడంతో పాలకొండ అతలాకుతలమైంది. జనజీవనం స్థంభించిపోయింది.

200 ఎకరాల్లో నీట మునిగిన వరి

పాచిపెంట: మండలంలో మిచౌంగ్ తుఫానుతో తీవ్ర నష్టం వాటిల్లింది. గత మూడు రోజులుగా ఎడతెరిపిలేని కురుస్తున్న వర్షంతో అనేక నష్టాలు కలిగాయి. మోసూరు, పాంచాలి, పనుకువలస, క్యారంగి పలు ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాల్లో వరి చేలు నేలకొరిగి నీట మునిగాయి. పంట చేతికి వచ్చే సమయానికి దెబ్బతీసిన తుపాను అన్నదాతకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అలాగే మోదుగ పంచాయతీ మెట్టవలసలో రెండు పశువులు మృతి చెందాయి. కుంతాం ఊబి గుడ్డి గ్రామాల మధ్య విద్యుత్ స్తంభం నేల కురిగింది. కొత్తవలస హైస్కూలు ప్రహరీ గోడ పూర్తిగా నేలమట్టమైంది. మాతుమూరు – గురువు నాయుడుపేట గ్రామాల మధ్య వట్టిగెడ్డపై ఉన్న కాజ్‌వేకు గండి పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ప్రజలు బయటకు వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదార్లతో పాటు పలువీధులు జలమయ్యాయి. పలు వీధుల్లో విద్యుత్ అంతరాయం కూడా జరిగింది. దీంతో ప్రజలు ఇబ్బందులపాలయ్యారు. ముఖ్యంగా ఈ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో తంపటాపల్లి, వి.పి.రాజుపేట, భాసూరు, అంపిలి, గోపాలపురం తదితర గ్రామాలలో వరి పంటలు నెలకొరిగింది. నీటిలో వరి కంకులు మునిగిపోవడంతో నేలమట్టమైంది. తహశీల్దారు సోమేశ్వరరావు దగ్గరుండి వరద పరిస్థితిని సమీక్షించారు. వీఆర్వోలు నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితులపై సమీక్షించారు.

150 ఎకరాల్లో నేలకొరిగిన వరి

సీతంపేట: మండలంలో గత మూడు రోజులుగా ఏజెన్సీలో వర్షాలు విస్తారంగా వర్షాలతో పాటు ఈదురు గాలులు వేయడంతో మండలంలో 150 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. ఏజెన్సీలో సోమగండి, కుడ్డపల్లి తదితర గ్రామాల్లో వరిసేను నేలకొరిగింది. సుమారు 16 ఎకరాల వరకు రైతులు వరి పంటను ఇప్పటికే కోశారు. కొంతమంది పొలాల్లోనే కుప్పలు వేస్తే, మరి కొంతమంది రైతులు టా ర్పన్లతో కప్పారు. ఇంకా తుపాను ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పంట తుఫాను రూపంలో చెయ్యి జారిపోతుందని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా నేలకొరిగిన వరి చేనును మండల వ్యవసాయాధికారి పి.శ్రీదేవి, ఎన్‌జి రంగా వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త పి.సీతారాం పరిశీలించారు. నేలకొరిగిన వరి చేను పొలాల్లో ఉన్న నీరును బయటికి విడిచి పెట్టాలని సూచించారు.

గుమ్మలక్ష్మీపురం : మిచౌంగ్ తుఫాను ప్రభావంతో మండలంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం వరకు ఎడతెరుపు లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కారణంగా వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో జరగాల్సిన గిరిజన వారపు సంత బోసిపోయింది. బయట ప్రాంతాల నుంచి వచ్చిన అరటి పండ్లు, కూరగాయల వ్యాపారులు వర్షంలోనే అమ్మకాలు చేపట్టారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట గ్రామాల్లో పలుచోట్ల వర్షం నీరు నిలిచిపోయింది. ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో పాదచారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో 813 హెక్టార్లలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంట వర్షానికి తడిసి ముద్దయింది. ఈదురు గాలుల ప్రభావం లేకపోవడంతో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నీటిలో వరిచేలు...

సీతానగరం : మండలంలోని గత రెండు రోజులుగా తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసి ఉన్న నీట్లో ఉండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని లక్ష్మీపురం, కామన్నదొరవలస, బుద్ధిపేట, బూర్జ, అంటిపేట, కాశీపట్నం, లచ్చయ్యపేట, రెడ్డివానివలస తదితర గ్రామాల్లో నీట్లో మునుగుతున్న వరిశేలను అధికారులు అంచనా వేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

నష్టపోయిన పంటలను కెవికె శాస్త్రవేత్తలు పరిశీలన

కురుపాం : తుఫాను కారణంగా నియోజకవర్గంలో నష్టపోయిన పంటలను కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి ఎస్ ఎస్ కే పాత్రో, ఇతర శాస్త్రవేత్తలు కురుపాం, జియ్యమ్మ వలస, గుమ్మలక్ష్మిపురం మండలాల్లో బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ 10-15 రోజుల్లో కోతకు వచ్చి వరిపంట నేలరాలి నీట మునిగితే బూజు తెగులు సోకి గింజ రంగు మారిపోతుందన్నారు. కావున వర్షాలు తగ్గిన వెంటనే 1.0 మిల్లీలీటర్లు, ప్రొపకొనజోల్ లేదా 1.0 గ్రాముల కార్బెండిజం మందును లీటరు నీటిలో కలిపి పంటకు పిచికారీ చేయాలని సూచించారు. పంట కోత దశలో ఉంటే 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి వరివెన్నులపై పిచికారీ చేయాలన్నారు. అలాగే రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డా.ఎన్. శ్రీనివాస రాజు, డా.ఎస్. స్రవంతి, డా.జి. అమృత వీణ పాల్గొన్నారు.

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం సాయంత్రం వరకు కురిసిన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ)
వీరఘట్టం	29.8
సీతంపేట	30.0
భామిని	29.0
పాలకొండ	39.2
కొమరాడ	44.6
గుమ్మలక్ష్మీపురం	22.2
కురుపాం	34.6
జియ్యమ్మవలస	34.2
గరుగుబిల్లి	52.2
పార్వతీపురం	63.8
మక్కువ	74.4
సీతానగరం	46.6
బలిజిపేట	59.8
సాలూరు	78.4
పాచిపెంట	69.0

పిహెచ్‌సికి పొంచి ఉన్న ముంపు ముప్పు

సాలూరు : మిచౌంగ్ తుఫాన్ కారణంగా గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముంపు ముప్పు పొంచి ఉంది. ఆసుపత్రికి సమీపంలోనే సువర్ణ ముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వరదనీరు ఆవరణలోకి చేరింది. దీంతో అప్రమత్తమైన వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సిబ్బందితో ఆసుపత్రిలో ఉన్న మందులు, రిఫ్రిజిరేటర్లను స్టాఫ్ క్వార్టర్స్‌లోకి తరలించారు. ఇప్పటికే గతంలో రెండు సార్లు భారీ వర్షాలకు ఆసుపత్రి ముంపునకు గురైది. బుధవారం రాత్రికి భారీ వర్షాలు కురిసే అవకాశం వుందన్న సూచనల మేరకు వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆసుపత్రి ఖాళీ చేయించారు. బుధవారం ఉదయం గ్రామపెద్దలు, వైసిపి నాయకులు సువ్వాడ రామకష్ణ, పెద్దింటి మాధవరావుతో కలిసి వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ వరద ఉధృతిని పరిశీలించారు. ఆసుపత్రికి సమీపంలో ఉన్న తోటలోకి వరద నీరు చేరడంతో అత్యవసర మందులు, రిఫ్రిజిరేటర్లను తరలించాలని నిర్ణయించారు. పరిస్థితిని బట్టి ఆసుపత్రిలో వున్న పడకలను కూడా తరలిస్తామని చెప్పారు.



గుమ్మలక్ష్మీపురం వర్షాలకు పాడైపోయిన పత్తి పంట

ఉప్పొంగిన గోముఖి, సువర్ణముఖి

మక్కువ : తుపాను కారణంగా మండలంలోని ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వేలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. పంట చేతికి వచ్చే సమయంలో తుపాను అన్నదాతను కోలుకోలేని దెబ్బతీసింది. వరితో పాటు మొక్కజొన్న పంట కూడా తడిసిపోవడంతో తీవ్ర నష్టాన్ని చెవి చూడాల్సి వచ్చింది.

విఆర్ఎస్ ప్రాజెక్ట్ నుండి నీరు విడుదల

మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు వెంగళరాయసాగర్ నుంచి సువర్ణముఖి, గోముఖి నదుల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం రెండు నదుల రెగ్యులేటర్ల నుంచి సుమారు 3,500 క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేశారు. 14వేల క్యూసెక్కుల వరకు ప్రాజెక్టులోనికి ఇన్ఫ్లో పెరగడంతో దిగువకు నీటిని విడుదల చేశారు. నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులకు సమాచారాన్ని అందించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న గోముఖీ నది

18,19 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పండు, రాజశేఖర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభలు ఈనెల 18,19తేదీల్లో పాలకొండ పట్టణంలో జరగనున్నాయని, వీటిని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను స్థానిక సుందరయ్య భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో సంఘం ఏర్పడి 40 ఏళ్లు గడుస్తున్న నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ 31వ జిల్లా మహాసభలు ఈనెల 18, 19 తేదీల్లో పాలకొండ పట్టణంలో జరుగుతాయన్నారు. ఈ మహాసభల్లో విద్యారంగంలో వస్తున్న మార్పులు, సమస్యలపై ఎస్ఎఫ్ఐ చేసిన పోరాటాలు, వాటి ఫలితాలపై చర్చించి భవిష్యత్తు విద్యాభివృద్ధికి దోహదపడేలా ఈ వేదిక కానున్నదన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వల్ల విద్యారంగం అధోగతిపాలవుతుందని వాపోయారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు అనేక అవకాశాలు ఇస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేపడుతుందని, ఈ విధానం అమలు వల్ల పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారుతుందని అన్నారు. ప్రాంతీయ భాషలను నిర్వీర్యం చేస్తూ, శాస్త్రీయ విద్యను దూరం చేస్తున్న ఈ విద్యా విధానాన్ని దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయడానికి ముందుకు రాకపోగా మన రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుండడం దుర్మార్గమని వాపోయారు. అందులో భాగమే పాఠశాలలు విలీనం, ఎయిడెడ్ విద్యా సంస్థలు మూత, ప్రభుత్వ విద్యా సంస్థలు బలహీనపడి, కార్పొరేట్ విద్యా సంస్థలు బలోపేతం కావడమేనని తెలిపారు. విద్యారంగం సమగ్రమైన విద్యాభివృద్ధితో ముందుకు పోవాలని, అటువంటి అభివృద్ధి ఎస్ఎఫ్ఐ కృషి చేపడుతుందని, భవిష్యత్తు ఉద్యమాలను, నిర్మాణాలను ఉధృతం చేపట్టేందుకు ఈ మహాసభ చేపడుతున్నామని అన్నారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుండి 200 మంది ప్రతినిధులు, రాష్ట్ర నాయకత్వం పాల్గొనుందని, 18 న పాలకొండ పట్టణంలో ప్రదర్శన, 19న ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, మేధావులు, అభ్యుదయవాదులు ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజు,కమిటీ సభ్యులు శివ, శారద, శ్రావణి, ఇందు పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



అంబేద్కర్ నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు; నాయకులు

అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి - కలెక్టరేట్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక కోర్టు సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, పార్టీ పట్టణ, మండల కమిటీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ కుల, వర్ణ వ్యవస్థను సృష్టించిన మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా పోరాడి, సామాజిక న్యాయం, భారత ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, స్వాతంత్ర్యాలు, ఓటు హక్కు కల్పించి భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. భారత రాజ్యాంగం, దాని మౌలిక అంశాలుపై దాడి చేస్తూ ప్రజల హక్కులను హరిస్తున్న బిజెపి విధానాలకు వ్యతిరేకంగా అంబేద్కర్ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ, నిరసన, ధర్నాలు, ఆందోళనపై నిర్బంధ నిరంకుశ చర్యలను ప్రజలంతా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, మండల కమిటీ సభ్యులు పి .రాము, రాజు ,పండు, సింహాచలం, రాజశేఖర్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పార్వతీపురంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఈనెల 8 నుంచి సమ్మెలోకి దిగుతున్న సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా తెలంగాణ కంటే అదనంగా వేతనం ఇస్తానని ఇచ్చి నాలుగురేళ్లయినా ఇంతవరకు దానిపైన ఎటువంటి స్పందన లేదన్నారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు కూడా గ్రాడ్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ అనంతరం జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, రిటైర్ అయ్యేటప్పుడు రూ.5లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, హెల్పర్ ప్రమోషన్‌కు 50 ఏళ్ల వయోపరిమితి పెంచాలని, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్ల చేయాలని, వీటిపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలకు పిలిచి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8 నుంచి సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా, మినీ కార్యకర్తలు పాల్గొంటారన్నారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు ఎం.గౌరీరాజేశ్వరి, జ్యోతి, నాగసులోచన, సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పట్టణ నాయకులు బి.రాధ ఆధ్వర్యాన కార్యకర్తలు పెద హరిజనపేటలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, నారాయణమ్మ,శశికళ పాల్గొన్నారు.

సీతంపేట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, యూనియన్ మండలశాఖ అధ్యక్ష కార్యదర్శి బి.పార్వతి ఎ.దర్శిమి, నాయకులు పి.అంజలి, సత్య, ఎస్.పద్మిని, రమాదేవి, మణి, ఎం.తిక్కమై తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: సమస్యలు పరిష్కారించాలని కోరుతూ అంగన్వాడీలు రెల్లివీధిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు యూనియన్ జిల్లా కోశాధికారి అమరవేణి, శ్రీదేవి, శారద, ఆరుద్ర, ఎం.రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు. అలాగే బుక్కూరులోనూ సమస్యలు కూడిన వినతి పత్రాన్ని అంబేద్కర్ చిత్రాలు పటలకు సమర్పించారు.

కొమరాడ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ గంగరేగవలస సెక్టార్ నాయకులు బి.అలివేలు, సిఐటియు మండల నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. ఈ మేరకు అంబేద్కర్ చిత్రపటానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పుష్పలత, సుజాత, అనురాధ, విజయ గౌరి, సునీత, అచ్చన్నమ్మ, జానకి పాల్గొన్నారు.



పార్వతీపురంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు

బలిజిపేట : సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 8నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న తమకు ప్రభుత్వం ఆలోచించేలా చేయాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు కె.దాలమ్మ, ఇందిర వినతిని అందజేశారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న జెసి గోవిందరావు

నేడు సాయుధ దళాల పతాకదినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఈనెల 7న సాయుధ దళాల పతాకదినోత్సవాన్ని పురస్కరించుకొని పతాక నిధికి విరాళాలు సేకరణ కార్యక్రమాన్ని జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు బుధవారం తన చాంబరులో ప్రారంభించారు. సాయుధ దళాల పతాకదినోత్సవం సందర్భంగా జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మంది సైనిక సహోదరులు దేశ రక్షణ కొరకు తమ ప్రాణాలు అర్పించారని, వారికి మనమంతా ఎంతో రుణపడి ఉన్నామని తెలిపారు. సాహసోపేత వీర జవానులకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయుతనిచ్చేందుకు గానూ ప్రతి ఏటా డిశంబరు 7న సాయుధ దళాల పతాకదినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు మాట్లాడుతూ విరాళాలను జిల్లా సైనిక సంక్షేమ అధికారి, విజయనగరం వారి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అక్కౌంటు నంబరు 52065221666, ఐఎస్ఎఫ్ఐ కోడ్ : ఎస్‌బిఐఎన్ :0020931, మైక్రో నెం.535002017 నందు గాని డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, విజయవాడ పేరున చెక్కు / డ్రాఫ్ట్ తీసి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయము, విజయనగరం వారికీ పంపాల్సింది కోరారు. ఈనెల 7న ఎన్‌సిసి విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వచ్చి విరాళాలు సేకరిస్తారని, వారికి పతాక నిధి విరాళాలను విరివిగా అందించి మాజీ సైనికుల సంక్షేమమునకు తోడ్పడవలసిందిగాను, పతాకనిధికి అందించే విరాళాలకు ఆదాయ పన్ను రాయితీ లభించునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది, మాజీ సైనికుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



టెండరుదారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

జిసిసి టెండర్లు నిర్వహణ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గల వసతిగృహాలకు నిత్యావసర వస్తువుల సరఫరాకు బుధవారం ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి సమక్షంలో టెండర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ టెండర్ల సమయంలో చూపించిన నాణ్యమైన సరుకులను మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. సరుకుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. మొత్తం 26 రకాల వస్తువులకు టెండర్లు నిర్వహించారు. 9మంది టెండరుదారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిసిసి డిఎం జి.సంధ్యారాణి, డిడి మంగవేణి, జిసిసి మేనేజర్లు దాసరి కృష్ణ, జి.నరసింహులు, గురుకులం సెల్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, హెచ్‌డబ్ల్యుఒలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్షను వీడాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ఆడ, మగ అనే లింగ వివక్షన వీడాలని డిఆర్‌డిఎ అధికారి బి.రాజశేఖర్ అన్నారు. మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు ప్రిన్సిపల్ సంధ్యారాణి అధ్యక్షతన ఎపిఎం పి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో లింగ వివక్షపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ లింగ వివక్ష సరైంది కాదని, మహిళలను అభివృద్ధి పర్చేలా ఆలోచనలుండాలని, గ్రామస్థాయిలో వ్యత్యాసాలు కనబడుతున్నప్పటికీ వీటిని విడనాడాలని సూచించారు. పిల్లలు తల్లిదండ్రులకు లింగ వివక్షపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, వెలుగు సిబ్బంది ఉన్నారు.

రెండు వారాల్లో పరిశీలిస్తాం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని శివ్వాంలో దళితుల భూములపై జరుగుతున్న అన్యాయంపై కెవిపిఎస్, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి మండల తహశీల్దార్ జివి జనార్ధన్ స్పందించి నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ రెండు వారాల్లో సమగ్ర చర్యలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, దీక్షను విరమించి అధికారులకు సహకరించాలని కోరారు. అందుకు బాధితులు, సిఐటియు నాయకులు మన్మధరావు అంగీకరించి రెండు వారాల్లో తమకు న్యాయం చేయకపోతే ఉద్యమం తీవ్రస్థాయిగా ఉంటుందని నాయకులు, బాధితులు స్పష్టం చేశారు.



చెరువును తలపిస్తున్న గురువుగారి వీధికి వెళ్లే రోడ్డు

అధ్వానంగా పాలకొండ

ప్రజాశక్తి - పాలకొండ

తుపాను కారణంగా కురిసిన వర్షానికి పాలకొండ నగర పంచాయతీ అధ్వానంగా దర్శనమిస్తుంది. ప్రధాన రహదార్లతో పాటు పలు వీధుల్లో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. కాలువల్లో పూడికలు నిండి ఉండడంతో మురికి నీరు కూడా రోడ్లపైనే ప్రవహించింది. దీంతో ప్రజలు అసహనానికి లోనయ్యారు. కొన్ని వీధుల్లో రహదార్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గురువుగారి వీధిలో రోడ్లపైనే నీరు నిల్వ ఉండడంతో ఆ రహదారి మీదుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందుల పాలయ్యారు. గొల్లవీధి జంక్షన్ నుంచి మురికి కాలువ నీరు రోడ్లపైనే ప్రవహించాయి. నగర పంచాయతీ అధికారులు కనీసం పట్టించుకోవడంతో ప్రజలు నుంచి తీవ్ర విమర్శలు వినిపించాయి.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలో బుధవారం వేకువ జామున లారీ డివైడర్‌ను ఢీకొంది. పార్వతీపురం నుండి పాలకొండ వైపు వస్తున్న లారీ తుపాను ప్రభావం వల్ల రహదారి మధ్యలో డివైడర్‌ను గమనించకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఎటువంటి ఘటన జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా, వీరఘట్టం గ్రామ ప్రధాన రహదారిలో సుమారు రూ.5.5 కోట్లతో ఉపాధి హామీ నిధులతో వట్టిగెడ్డ వంతెన నుండి స్వామి థియేటర్ వరకు ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి విస్తీర్ణ పనులు చేపడుతున్నారు. పనులు జరిగిన చోట కనీస అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



డివైడర్‌ను ఢీకొన్న లారీ

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - సాలూరు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన దిశగా మనంతా కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. అంబేద్కర్ 67వ వర్థంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లు గొర్లి వెంకటరమణ ,పప్పల లక్ష్మణరావు, గొల్లపల్లి వరప్రసాద్, మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు, వైసిపి నాయకులు లింగాల సింహాచలం,చింతగడ రాయప్ప వున్నారు. 25వార్డు బంగారమ్మపేట లో అంబేద్కర్ విగ్రహానికి వార్డు కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పాచిపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎంపిపి బి.ప్రమీల పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన బాటలోనే మనమంతా నడవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి వీరంనాయుడు (చినబాబు), స్థానిక ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, ఎంపిడిఒ లక్ష్మీకాంత్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణ ప్రధాన రహదారి మధ్యలో గల బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సవిరిసెట్టి. శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని రచించి భారతదేశానికి అందజేయడమే కాక ప్రపంచ దేశాలు కూడా మన రాజ్యాంగాన్ని అనుసరించే విధంగా చేసిన మహనీయుడని అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనదేనని అన్నారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాసరావు తవిటి నాయుడు, చంద్ర, భాగ్యవతి, లలిత, గండి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సాలూరు : నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు



సీతంపేట : అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపిడిఒ

పాలకొండ : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని తహశీల్దారు పి.సోమేశ్వరరావు అన్నారు. ఏలాం జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా ప్రజలందరికీ సామాన హక్కులను కల్పించిన మహనీయుడని కొనియాడారు. ఎంపీడీవో డొంక త్రినాద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు ఎంతో గొప్పవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు బుచ్చయ్య, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు భరత్‌భూషణ్‌రాజు, బత్తిన మోహనరావు, తిర్లాంగి ఉపేంద్ర, పి.రమేష్, సురేష్, సుధాకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంబేద్కర్ అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి అని శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు పాలక దేవానంద్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని మండ ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాము, అగ్రికల్చర్ అసిస్టెంట్ పాలక ఆశ, గ్రామ పెద్దలు పువ్వల లక్ష్మణరావు, రాజ, మంగ పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు పట్టణంలో నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, బోను చంద్రమౌళి,



పార్వతీపురం : అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

కార్యదర్శులు మజ్జి వెంకటేష్, గురజాన చంద్రమౌళి, నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, బార్నాల సీతారాం, బలిజిపేట, సీతానగరం మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

భామిని: స్థానిక అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, ప్రిన్సిపల్ విజయ నిర్మల, వైసిపి నాయకులు బొమ్మాలి సంజీవరావు, ఎంపిటిసి సభ్యులు బిడ్డిక విష్ణు, రొక్కం రమేష్, గేదల మోహన్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

సీతంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.గీతాంజలి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. రాజ్యాంగ కర్తగా అంబేద్కర్ సేవలను స్మరిస్తూ వారు సూచించిన విలువలను పాటించడమే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.సత్యం, ఎఒ మాస, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో యువత, విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురం

ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో శాశ్వత సెంటర్లు, మొబైల్ ప్రదర్శన వ్యాన్లు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ ఎన్నికల రోల్ అబ్జర్వర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు గురువారం జిల్లాకు వస్తున్నారని, ఆయన నిర్వహించే సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై వారి సలహాలు, అభిప్రాయాలు తెలియజేయాలని అన్నారు. అక్టోబరు 27న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ జాబితాపై క్లైములు, అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తామన్నారు. ఇంకా మూడు రోజులే సమయమున్నందున రాజకీయపార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించి, ఓటర్లు ముసాయిదా ఓటరు జాబితా తనిఖీ చేసుకొని క్లైములు, అభ్యంతరాలుంటే తెలియజేసి శుద్దమైన ఓటరు జాబితా తయారీకి సహకరించాలని తెలిపారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరించి, జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 2,3 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో 4555 ఫారం - 6, 2017 ఫారం - 7, 1856 ఫారం - 8 స్వీకరించినట్టు

నేడు రోల్ పరిశీలకుల రాక

తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మిషను, వివి పాట్ పనితీరు, ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా ఎన్నికల కార్యాలయం, రిటర్నింగ్ అధికారి ప్రధాన కార్యాలయం లేదా రెవెన్యూ సబ్-డివిజన్ అధికారుల వద్ద శాశ్వత సెంటర్లు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మొబైల్ ప్రదర్శన వ్యాన్‌ఏర్పాటు చేయడం జరిగిందని, మొబైల్ వ్యాన్ షెడ్యూలు ముందుగా తెలియజేస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో ప్రజలను పాల్గొనేలా ప్రోత్సహించాలని జాయింటు కలెక్టరు తెలిపారు.

డిఆర్‌ఒ జె. వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 169181 ఫారాలు స్వీకరించగా, వాటిలో 146829 ఫారాలు పరిష్కరించి ఓటరుజాబితాలో చేర్చడం జరిగిందని, 1226 ఆమోదం చేయడం జరిగిందని, 3988 తిరస్కరణకుగురయ్యాయని, 17138 పరిష్కరించవలసి ఉన్నదని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్లపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా చేపట్టాలని రాజకీయపార్టీల ప్రతినిధులు కోరారు. సమావేశంలో వైసిపి పార్టీ ప్రతినిధి వి. శ్రీనివాసరావు, టిడిపి ప్రతినిధి జి. వెంకటనాయుడు, ఆప్ పార్టీ ప్రతినిధి పి.రవికుమార్ పాల్గొన్నారు.



పోలీసు అధికారి వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీ నాయకులు, కార్యకర్తలు

పోలీసులకు అంగన్‌వాడీల సమ్మెనోటీసు

ప్రజాశక్తి - కురుపాం

అంగన్‌వాడీ కార్యకర్తలు వారి హక్కుల సాధనకు ఈనెల 8 నుంచి చేపడుతున్న నిరవధి సమ్మె కారణంగా బుధవారం స్థానిక పోలీసు సిబ్బందికి సిఐటియు నాయకులు వి. ఇందిర, యూనియన్ జిల్లా అధ్యక్షులు సరళకుమారి సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, 0-6 ఏళ్లలోపు పిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు, అనేక సేవలందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడంలేదన్నారు. నిరంతరం నిత్యావసర సరుకుల ధరలు, డీజిల్, పెట్రోల్, గ్యాస్, ఆర్టీసీ, రైల్వే ధరలు పెరుగుతున్నా వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాలతో జీవనం గడపడం కష్టంగా ఉందన్నారు. అంతేకాక అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణా కంటే రూ.వెయ్యి ఎక్కువ వేతనం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి హామీ నెరవేరలేదన్నారు. అంగన్వాడీల హక్కుల సాధనకు ఈనెల 8 నుంచి సమ్మె చేపడుతున్నామని, ప్రభుత్వం ఎప్పటికైనా స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్ల జిల్లా కార్యదర్శి జె.సరోజ, అంగన్వాడీలు కృష్ణవేణి, రాధా కుమారి, సూర్యకుమారి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

డిసిసి అధ్యక్షునికి వినతి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మక సింహాచలం కు కురుపా నియోజకవర్గం అంగన్వాడీ యూనియన్ సభ్యులు తమ సమస్యలపై కలిసి పోరాడాలని కోరారు. ఈ సందర్భంగా చింతలపాడు వెళ్లిసింహాచలాన్ని కలిశారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే అంగన్వాడీల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు.

ముందస్తు చర్యలు చేపట్టినా తప్పని తిప్పలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తుపాను కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని ముందస్తు చర్యల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఆధ్వర్యంలో మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలపై ఉన్న పలకలను తొలగించారు. అయినా మంగళవారం రాత్రి నుండి బుధవారం వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి పట్టణంలోని రాజు గారి కోట కూడలి నుంచి ప్రధాన రహదారి పక్కనే ఉన్న కలింగవైశ్య కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ఉన్న కాలువల్లో వర్షపు నీరు ప్రవహించేందుకు అవకాశం లేక కాలువల్లోని బురదతో చెత్తను, వ్యర్థాలు ప్రధాన రహదారిపైకి వచ్చాయి. దీంతో బుధవారం ఉదయం ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళి పారిశుధ్య కార్మికులతో ప్రధాన రహదారిపై ఉన్న మురుగునీరు వెళ్లేందుకు పలకను తొలగించి పారిశుధ్య కార్మికులచే రహదారిని శుభ్రపరిచేందుకు నానా తంటాలు పడ్డారు.



ప్రధానరహదారిపై ప్రవహిస్తున్న మురుగునీటిని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

శాశ్వత పరిష్కారానికి చర్యలు శూన్యం

దశాబ్ద కాలంగా పట్టణంలో పడమటి భాగాన రాజు గారి కోట కూడలి నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం కూడలి, తాళాభక్తుల వారి వీధి కూడలి, మేదరవీధి కూడలి వరకు ఏ మాత్రం చిన్నపాటి వర్షం కురిసిన కాలువలో ఉండే మురుగునీటితో పాటు చెత్తలు, వ్యర్థాలు, వర్షపు నీటితో కలిసి రహదారి పైనే పొంగిపొర్లుతుంది. ఆ సమయంలో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఈ రహదారిపై రాకపోకలు సాగించాలంటేనే నానా అవస్థలుపడాల్సిందే. ఇంత జరుగుతున్నా ఇటు పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు గానీ, మున్సిపల్ అధికారులు కానీ శాశ్వత పరిష్కారం చూపకపోవడాన్ని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయాల్సిన బాధ్యత పాలకవర్గ కౌన్సిల్ సభ్యులకు, అధికారులకు ఎంతైనా ఉంది.



నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

రైతుల కష్టం పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం రైతుల కష్టాలను కనీసం పట్టించుకోవడంలేదని కురుపాం నియోజవర్గం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస మండలాల్లో నష్టపోయిన వరి పంటలను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిన్న మొన్నటివరకు వర్షాలు లేక పంటలు పూర్తిగా ఎండిపోయి తీవ్ర కరువు ఛాయలు ఏర్పడ్డా ప్రభుత్వం, అధికారులు కనీసం స్పందించకపోవడం శోచనీయమన్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి పంటలు వేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమని చెప్పుకుంటున్న ప్రభుత్వం రైతులకు చేసిందేమీలేదని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు రోబ్బ లోవరాజు ఉన్నారు.

భామిని : తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని తలడా, పెద్దదిమిలి గ్రామాల్లో పాడైన వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ పంట కోత దశలో తుపాను తీవ్ర నష్టానికి గురించేసిందన్నారు. రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం మద్దతు ధరకే కొనుగోలుచేసేలా చూడాలని కోరారు. ఈ పరిశీలనలో మండల టిడిపి అధ్యక్షులు భోగాపురపు రవినాయుడు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, ఆగతాముడి గోవిందరావు, వలు రౌతు మనోజ్ కుమార్ వున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి


ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. తుపాను అనంతర పరిస్థితుల పరిశీలనలో భాగంగా మండలంలోని పెదబొండపల్లి పిహెచ్‌సిని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు చర్యలు ఏ మేరకు చేపట్టడం జరిగిందని ఆరా తీశారు. అత్యవసర మందులు, యాంటీ స్నేక్ వీనం, ల్యాబ్, వార్డు, వ్యాక్సిన్ నిల్వలు, ప్రసూతి గది పరిశీలించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ఇన్వర్టర్, బ్యాటరీ పనితీరును పరిశీలించారు. ఈనెల 15 వరకు ప్రసవ తేదీ ఉన్న ఇంకా డెలివరీ అవ్వని గర్భిణుల విషయంలో ఏ విధమైన వైద్య సంరక్షణ చర్యలు తీసుకున్నారని ఆరా తీశారు. కాన్పు పూర్తయ్యే వరకు పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఓపి నిర్వహణ రికార్డులో నమోదైన రోగుల ఆరోగ్య వివరాలు పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జ్వరాలు, డయేరియా, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు చేపట్టి, క్షేత్ర స్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యవేక్షణ చేసి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులు, నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో క్లోరినేషన్, శానిటేషన్ పక్కాగా జరగాలన్నారు. పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపి ప్రగతి నివేదికల పురోగతి సాధించాలన్నారు. పిహెచ్‌సిలో సాధారణ కాన్పులు జరగాలని ఆదేశించారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని ఈనెల 11 నుంచి నిర్వహించబోయే మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమానికి సూచించిన మార్గదర్శకాలను అమలు చేయాలన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు నెలనెలా చికిత్స, పర్యవేక్షణ ఉండాలని, చికిత్సా కాలం వరకు వీరికి ప్రతినెలా పౌష్టికాహారం కోసం ప్రభుత్వం రూ.500 చెల్లిస్తుందన్నారు. లెప్రసీ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందజేసి, పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అనూష, సూపర్ వైజర్లు వెంకటనాయుడు, శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు, ఇంటికి, పశువులకు కాపరులకు పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సీనియర్ అసిస్టెంట్ జె.ఉదయకుమార్ వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం, రైతు సంఘం నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు, కె.వీరన్న మాట్లాడుతూ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని, పంటలకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, చేతికి అందికొచ్చిన పంటలు నేలమట్టమవ్వడం, ప్రకృతి బీభత్సం వల్ల ఇటువంటి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకొని చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలోని గరిసిగుడ్డి పంచాయతీ చిమ్మిడివలస గ్రామానికి చెందిన ఓలికి సాంబమూర్తి పెంకుటిల్లు కూలిపోయిందని, అలాగే తొమరావిల్లిలో మేకలు చనిపోవడం రైతు నష్టపోయాడని, మూటకూడు పంచాయతీ చిట్యాల ప్రాంతాల్లో రెండు పశువులు చనిపోయాయని, ఇంకా తెలియనటువంటి గ్రామాలు నష్టాలు సంబంధించి పరిశీలించి పరిహారం ఇవ్వాలని కోరారు..



రెవెన్యూ అధికారికి వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తం

గుమ్మలక్ష్మీపురం : గ్రామంలో తరచూ చిన్న, చిన్న దొంగతనాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో ఐదు గురు గుర్తు తెలియని వ్యక్తులు ఊర్లోకి వచ్చే ప్రతి షాపు తనిఖీ చేసి దొంగతనం చేసేందుకు సిద్ధపడ్డారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పంచాయతీ తరపున గ్రామంలో ప్రత్యేక గస్తీ ఏర్పా టు చేస్తున్నట్లు సర్పంచి బి.గౌరీశంకరరావు తెలిపారు. పోలీసుల సా యంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. బుధవారం నుంచి ప్రత్యేకంగా వాలంటీర్లు ప్రత్యేకంగా గస్తీకాస్తూ తనిఖీ చేస్తున్నారని తెలిపారు.

జలమయమైన రామాకాలనీ, ఆర్‌టిసి కాంప్లెక్స్

ప్రజాశక్తి - సాలూరు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రామా కాలనీ లోతట్టు ప్రాంతం ఎప్పటిలాగే చెరువుని తలపించేలా వుంది. ఆర్టీసి కాంప్లెక్స్ ప్రాంగణమంతా నీటితో నిండింది. ఫిలిడెల్ఫియా ఆసుపత్రి ముందు న్న చెరుకుపల్లి గెడ్డ కాలువ పూడిక తీత పనులు మంగళవారం చేయడంతో బుధవారం వరద నీరు జాతీయ రహదారిపైకి రాలేదు. అయినా రామాకాలనీ పైనున్న పొలాల నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంతం జలమయమైంది. మున్సిపల్ కమిషనర్ టి.జయరాం ఆధ్వర్యాన సిబ్బంది బుధవారం లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. పట్టణంలోని ప్రధాన కాలువల్లో వరద నీరు ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు చేపట్టారు. చినహరిజనపేట, బంగారమ్మ కాలనీ, హెడ్ వాటర్ వర్క్స్ ప్రాంతాలను పరిశీలించారు. కాకులతోట వాటర్ వర్క్స్ పక్క నుంచి ప్రవహిస్తున్న వేగావతి నది ఉధృతిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. భారీ వర్షాలకు తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడితే జనరేటర్‌తో సరఫరా చేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయన వెంట శానిటేషన్ ఇన్ స్పెక్టర్ ఫకీర్ రాజు వున్నారు.



జలమయమైన ఆర్‌టిసి కాంప్లెక్స్